## క్లుప్తంగా

### నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు



నరేందర్‌రెడ్డిని కలిసిన జానకీరామ్

**తుక్కుగూడ :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని సోమవారం పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గోగికర్ జానకీరామ్ నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### వేంకటేశ్వరకాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం సభ్యులు

**హుడాకాంప్లెక్స్:** సరూర్‌నగర్ డివిజన్ పరిధి వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండు ధనంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మారోజు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పీ.వీ.ఎస్.ప్రసాద్, కోశాధికారిగా ఎన్.వీ.ఎస్.సాయికిరణ్, సంయుక్త కార్యదర్శిగా పి.మధుసూదన్‌రెడ్డి, శంకర్, కల్చరల్ సెక్రటరీగా విజయ్‌కుమార్, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా బంగారు సందీప్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ధనంరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు సహకారం అందజేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీ, జేఎస్ఎన్ యూఆర్ ఎంకాలనీలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాత, కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, మనోహర్, బాలు నాయక్, జైహింద్, కార్పొరేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, జంగయ్య, సుభాన్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, మధు తదితరులున్నారు.

### వైభవంగా బీరప్ప ఉత్సవాలు

**షాబాద్:** డిల్లెంపల్లెం మోత, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల మధ్య మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో సోమవారం బీరప్ప ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ ఉదయం గంపలను నెత్తిన పెట్టుకొని ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఓ వైపు మల్లన్న, భ్రమరాంభ అమ్మవార్ల కల్యాణం జరుగుతుండగానే మరోవైపు బోనాలను సిద్ధం చేశారు. సాయంత్రం మహిళలు బోనాలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మాజీ సర్పంచ్‌లు తమ్మలి రవీందర్, చెన్నయ్య, అశోక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, మాజీ మద్దూరి శకుంతల పాండు, ఎంపీటీసీ గుత్తి సునితారామస్వామి ఉన్నారు.

### ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

**షాబాద్:** ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని చేవెళ్ల బీజేపీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. తమ గ్రామంలో ఆలయాలు నిర్మించి పూజలు చేస్తే మంచి జరుగుతుందన్నారు.

# ఎన్నాళ్లో వేచిన ఉదయం!

**1వ తేదీ నుంచే రేషన్ బియ్యం పంపిణీ**

- పదేళ్ల తర్వాత సకాలంలో బియ్యం పంపిణీకి సిద్ధం
- ఈ నెల ఒకటి నుంచే పంపిణీ చేపట్టిన డీలర్లు
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



మహేశ్వరంలో గోదాంలో నిల్వ ఉన్న రేషన్ బియ్యం

**మహేశ్వరం:** సుమారు పదేళ్ల తరువాత రేషన్ షాపుల్లో ఒకటో తేదీ నుంచి బియ్యం పంపిణీ మొదలయింది. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో అందించే రేషన్ బియ్యం పంపిణీ 1వ తేదీనే మొదలుపెట్టాలని సివిల్ సప్లయి అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో ఈ నెల నుంచి ఒకటో తేదీ నుంచి నియోజకవర్గంలో డీలర్లు రేషన్ బియ్యం పంపిణీ మొదలుపెట్టారు. మహేశ్వరం మండలంలోని 31 గ్రామ పంచాయతీలు, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో మొత్తం 48 రేషన్ షాపులు ఉన్నాయి. మొత్తం రేషన్ కార్డులు–17790, అంత్యోదయ కార్డులు–2471, ఆహార భద్రత కార్డులు–15308, అన్నపూర్ణ కార్డులు–11 కార్డులు ఉండగా అన్ని కలిపి 56,491 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికి ప్రతి నెల 391.683 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది.

**గతంలో గందరగోళం...**

గత ప్రభుత్వ హయాంలో సుమారు పదేళ్ల పాటు రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా కొనసాగింది. ఏ నెలలో ఎప్పుడు బియ్యం పంపిణీ మొదలవుతుందో తెలియని గందరగోళ పరిస్థితి. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల కోసం నెలనెలా ఎదురుచూడడం .. ఆదేశాలు అందక బియ్యం పంపిణీ మొదలు పెట్టినా ఎన్ని రోజులు ఇస్తారో కూడా తెలిసేదికాదు. దీంతో లబ్ధిదారులు నెల మొదటి నుంచి రేషన్ షాపులు చుట్టూ తిరగడం కనిపించేది. పలు మార్లు లబ్ధిదారుల అవస్థ చూడలేక రేషన్ డీలర్లే పైనుంచి ఆదేశాలు రాగానే బియ్యం పంపిణీ తేదీ తెలియజేస్తామని చెప్పి పంపించేవారు.

**కొత్త ప్రభుత్వం నూతన సంస్కరణలు**

ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో శాఖపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో సీఎంఆర్‌పై దృష్టి సారించి మిల్లర్ల నుంచి బియ్యం సేకరణలో వేగం పెంచారు. ఇక ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇక ఏ నెల కూడా ఎట్టి పరిస్థితిల్లో ఈ తేదిల్లో(1నుంచి 15వ తేది వరకు) మార్పులు ఉండవని స్పష్టం చేసింది.

**ఒకటో తేదీనే తీసుకున్నా**



ఈ నెల ఒకటో తేదీనే రేషన్ బియ్యం తీసుకున్నా. గతంలో ప్రతి నెల 5 నుంచి 10వ తేదీలోపు రేషన్‌డీలర్ వద్దకు బియ్యం వచ్చేవి. కొత్త ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయంతో ఒకటోవ తేదీ నుంచి ప్రతి రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ చేపడుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఎంతో మందికి మేలు జరుగుతుంది.

– కేతావత్ విజయ్‌నాయక్ లబ్ధిదారుడు, మొహబ్బత్‌నగర్

**బియ్యం పంపిణీ చేస్తున్నాం**



లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఒకటోవ తేదీ నుంచి పంపిణీ చేస్తున్నాం. గతంలో మిల్లుల నుంచి బియ్యం గోదాములకు సమయానికి వచ్చేవి కావు. లబ్ధిదారులు రేషన్ షాపుల చుట్టూ బియ్యం కోసం తిరిగిపోయేవారు. ప్రభుత్వం తీసుకునన్న నిర్ణయంతో మాకు కూడా ఆనందంగా ఉంది.

– పి.లక్ష్మీనారాయణ గౌడ్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

**1నుంచి 15వరకు పంపిణీ**



రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఇక నుంచి ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 వరకు డిల్లర్లు పంపిణీ చేస్తారు. మార్చిలో మండలంలోని 48 రేషన్ షాపుల్లో డీలర్లు 1వ తేదీ నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేపట్టారు.

– విజయలక్ష్మి, తహసీల్దార్, మహేశ్వరం

### పురాతన ఆలయాలను కాపాడుకోవాలి

**బీజేపీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

**చేవెళ్ల:** గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాలను కాపాడుకోవాలని బీజేపీ చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని కొకుంట్ల గ్రామంలో సోమవారం గ్రామ శివారులో ఉన్న ఈశ్వరుని బాయి దగ్గర ఉన్న సహజ బ్రహ్మసూత్ర శివాలయ నూతన ఆలయ నిర్మాణం, ప్రాణప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో బీజేపీ నాయకుడు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు చేసిన ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణ బీజేపీతోనే సాధ్యమవువుతుందని చెప్పారు. అందుకే కేంద్రంలో ప్రధానిగా మోదీనే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున్‌రెడ్డి, శివకుమార్, ఆలయ ధర్మకర్త పి.లక్ష్మారెడ్డి, గ్రామస్తులు కరణ్‌జీ, రుషి కేశ్‌గౌడ్, రాందేవ్, సత్యనారాయణ, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

### నూతన నియామకం

**కేశంపేట:** బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన రొల్లు రఘురాంగౌడ్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి సోమవారం మండల అధ్యక్షుడికి నియమాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘురాంగౌడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

## కల్యాణ వైభోగమే

- కనులపండువగా వేంకటేశ్వరస్వామి, గోపాలస్వామి కల్యాణోత్సవాలు
- ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు
- తరలివచ్చిన భక్తజనం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

**ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని వెంకటగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అలివేలు మంగాసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పట్టణప్రజలతో పాటు, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యుల బృందం నిహాల్, అనిల్‌కుమార్, వెంకటరమణచారి, కృష్ణచైతన్యచారి, సంజీత్‌పాండే, శ్రీకాంత్ ఆధ్వర్యంలో వేడుక అట్టహాసంగా ప్రారంభమైంది. నాట్యమయూరి శాస్త్రీ ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

**గోపాలస్వామి కల్యాణోత్సవంలో..**

**తలకొండపల్లి:** కల్కిదోనగుట్ట గోపాలస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మండల పరిధిలోని చుక్కాపూర్ శివారు ప్రాంతంలోని జోతీష్యాశ్రమ సమీపంలో వెలిసిన కల్కిదోనగుట్ట దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గణపతి పూజ, అభిషేకం, పుణ్యాహవాచనము అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు గోపాలస్వామి కళ్యాణాన్ని నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండరీ, ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ, ఆలయ కార్యనిర్వాహక సభ్యులు కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

## మొదటి రోజు ‘పది’ పరీక్ష ప్రశాంతం



జిల్లెలగూడ పాఠశాల వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్



నేదునూరు మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలోకి క్యూలో వెళ్తున్న విద్యార్థినులు

**కందుకూరు:** పది పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో 789 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరయ్యారు. కందుకూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 118 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు. నోబుల్ కేంద్రంలో 270 మందికి గాను 270 మంది, నేదునూరు మోడల్ స్కూల్‌లోని రెండు పరీక్షా కేంద్రాల్లో 401 మంది విద్యార్థులకు 401 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ టి.మనోహర్, ఎంపీడీఓ సరిత పరిశీలించారు.

**మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో**

**మీర్‌పేట:** పదోవ తరగతి పరీక్షలు సోమవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్టేషన్ పరిధిలో మొత్తం 15 కేంద్రాల్లో 3070 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపుతున్న సిబ్బంది



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

### పంట నష్టపరిహారం ఇవ్వాలి

**మంచాల:** గ్రామాల్లో వరిపంట ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. మంచాల మండల పరిధిలోని తిప్పాయిగూడలో వరిపంట చేలను సోమవారం వారు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి ఎండలు తీవ్రం కావడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి వరిపంట చేలు నీరందక ఎండిపోయాయన్నారు. పాడిపశువులకు కూడా మేత కరువైందని అన్నారు. ప్రభుత్వం ఎండిన వరిపంట పొలాలకు ఎకరాకు రూ.20వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పాడి పశువులకు ఉచితంగా పశుగ్రాసం పంపిణీ చేయాలని కోరారు. ఎన్నికల కోడ్ పేరుతో నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామాల్లో వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఎండిపోయిన పంటచేల వివరాలను సేకరించాలన్నారు. వీలైనంత త్వరగా పరిహారం అందజేయాలని కోరారు.

# పడకేసిన పశువైద్యం

- మండలంలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్న పశుపోషకులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



తాళ్లపల్లిలో సిబ్బంది లేక మూతపడిన పశువైద్య ఉపకేంద్రం

**షాబాద్:** మండలంలో పశువైద్యం పడకేసింది. సిబ్బంది కొరత కారణంగా మూగజీవాలకు సరైన వైద్యం అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పశువులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. పశువులు, గొర్రెలకు రోగాలు వస్తే చికిత్స ఎలా చేయించాలో తెలియక గొర్రెల కాపరులు, పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని పశువైద్య శాలల్లో డాక్టర్లే లేరు. పలుచోట్ల ఒకరు, ఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో పశుపోషణపై ఆధారపడిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో మొత్తం 2 పశువైద్య కేంద్రాలు, 6 ఉపకేంద్రాలు ఉన్నాయి. మొత్తం 14,046 పశువులు ఉండగా, 67,146 గొర్రెలు, మేకలు ఉన్నాయి. అదే విధంగా 15,112 కోళ్లు ఉన్నాయి. వీటన్నింటికీ పశువైద్య సిబ్బంది ఆరు నెలలకోసారి ఏడాదికి రెండుసార్లు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాల్సి ఉంటుంది. అదే విధంగా గొంతువాపు, జబ్బవాపు, పార్శురోగం, చిటిక వ్యాధులకు టీకాలను అందివ్వాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగా పశుపోషకులు పశువులు, గొర్రెలకు రోగాలు వస్తే ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

**విధుల్లో ఇద్దరే డాక్టర్లు..**

మండలంలో షాబాద్ డాక్టర్ స్రవంతి, రేగడిదోస్వాడ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా తాళ్లపల్లి, చందనవెల్లి, పోతుగల్, మాచన్‌పల్లి, బోడంపహాడ్, సర్దార్‌నగర్ పశువైద్య ఉప కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉండటంతో ఆయా గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నా.. లేనట్టేనని ఆయా గ్రామాల రైతులు, గొర్రెల కాపరులు ఆరోపిస్తున్నారు. డాక్టర్లు, సిబ్బంది లేక పశువైద్య కేంద్రాలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లోని పాడి పశువులు, గొర్రెలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సొంత భవనాలను నిర్మించి అన్ని సదుపాయాలు కల్పించినా వైద్యులు లేకపోవడంతో అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. సిబ్బంది కొరతతో గ్రామాల్లో రైతులు తమ పశువులకు, గొర్రెలకు ఏదైనా జబ్బు చేస్తే ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి పశువైద్య సిబ్బందితో పాటు పదిమంది పశువైద్య సహాయకులు, మరో పందిమంది సహాయకులు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే చందనవెల్లి, సర్దార్‌నగర్‌లో మాత్రమే పశువైద్య సహాయకులు ఉన్నారు. వారే అన్ని విధులు నిర్వహిస్తున్నారు. తాళ్ళపల్లి, మాచన్‌పల్లి, పోతుగల్, బోడంపహాడ్ గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాల్లో సిబ్బంది లేక మూతపడ్డాయి. షాబాద్, రేగడిదోస్వాడలో మాత్రమే ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య కేంద్రాల్లో సిబ్బందిని నియమించి పాడిపశువులు, గొర్రెలకు వైద్యసేవలు అందేలా చూడాలని పాడి రైతులు కోరుతున్నారు.

**సిబ్బందిని నియమించాలి..**



పశువైద్య కేంద్రాల్లో నెలకొన్న సిబ్బంది కొరతను అధికారులు తీర్చాలి. మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. సిబ్బంది కొరతతో మూగజీవాలకు వైద్యం అందక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

–గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్

**సమస్య పరిష్కరించాలి**



గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి ప శువైద్య కేంద్రాన్ని నిర్మించినా సి బ్బంది లేకపోవడంతో భవనం ని రుపయోగంగా మారింది. సిబ్బంది లేకపోవడంతో ఉపకేంద్రం మూ తపడటంతో పాటు పశువులు, గొర్రెలకు వైద్యం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉన్నతాధికారు లు సిబ్బందిని నియమించి సమస్య పరిష్కరించాలి.

–బండ నర్సింహారెడ్డి, రైతు, మన్‌మర్రి

# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

**షాద్‌నగర్:** అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందుకు గాను సోమవారం ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాటకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందన్నారు. కేసీఆర్ చేపట్టిన విధానాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంతా అస్తవ్యస్తమైందన్నారు. షాద్‌నగర్‌లో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం తాలుక అధ్యక్షుడు మేడిగ పెంటయ్య, మంచిరేవుల సాయికృష్ణ, గుండు నారాయణ, మల్చాలం మురళీ, చంద్రశేఖర్, ఇస్నాతి శ్రీనివాస్, శ్రీశైలం, రాజగోపాల్, శంకరయ్య, పద్మారావు, విద్యాసాగర్, దివాకర్, మేడిగ శ్రీనివాస్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా విజయాలను గుర్తించడం బాధ్యత



మహిళను సన్మానిస్తున్న శివకాంచనలత

**మొయినాబాద్‌రూరల్:** మహిళలు విజయాలు సాధించినప్పుడు వేడుకలు జరుపుకొనేందుకు ముందుండాలని కేఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి కోనేరు శివకాంచనలత అన్నారు. మహిళా విజయాలను గుర్తించడం అందరి బాధ్యత అన్నారు. సోమవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో గల కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో మహిళల విజయాలతో వేడుకలు జరుపుకోవడానికి ఫేమ్ ప్లేయర్ 2కే 24 అనే పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోనేరు శివకాంచనలత పాల్గొని ఆమె మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన అసాధారణ విజయాలు సాకారాన్ని స్మరించుకోవడంలో ముందుండాలన్నారు. అందులో భాగంగా కేఎల్ డీమ్డ్ టూబీ విశ్వవిద్యాలయంలో మొదటి స్థానంలో ఉందని ఉమెన్స్ డెవలప్‌మెంట్ సెల్ మహిళా విద్యార్థినులు, అధ్యాపకులు అంకితభావం, నైపుణ్యాలను గుర్తించి గౌరవించాలనే నిబద్ధతను సూచించారు. ఫేమ్ ప్లేయర్ 2కే 24ను ఉమెన్స్ ఫోరం ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఇది మహిళలకు సాధికారిత చైతన్యం కలిగిస్తుందని పేర్కొన్నారు. మహిళలు సాధించిన విజయాలకు క్రెడిట్ ఇవ్వాలని సూచించారు. అనంతరం మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో క ళాశాల ప్రిన్సిపాల్ పార్థసారధివర్మ, వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమ్య, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.